## క్లుప్తంగా

### నేడు కోదడ్డపనసలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని గుమ్మపాడు సచివాలయ పరిధి కోదడ్డపనస పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

### ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్

కొత్తూరు: కొత్తూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా మహమ్మద్ అజాద్ అహమ్మద్‌ను నియమించినట్లు కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు మంగళవారం తెలిపారు. ఆమదాలవలస స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ మురపాక గోవింద్‌ను శ్రీకాకుళంలోని ఎస్పీ ఆఫీస్‌లో వీఆర్‌లో ఉంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### క్రమశిక్షణ అలవర్చుకోవాలి


డాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత శిఖరాలకు అందుకోగలరని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థికి ఇంటర్మీడియెట్ దశ కీలకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సినీ, జానపద, జాతీయ గీతాలకు నృత్యం చేశారు. ఎద్దు గోపాలదాసునాయుడు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


### వ్యవసాయ రుణాల లక్ష్యాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

కొత్తూరు: అర్హత గల ప్రతీ రైతుకు వ్యవసాయ రుణాలు ఈ నెల చివరి నాటికి అందజేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని బ్యాంకర్స్‌కు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకుమార్ ఆదేశించారు. కొత్తూరు యూనియన్ బ్యాంకులో మంగళవారం జేఎంఎల్‌బీసీ సమావేశాన్ని యూనియన్ బ్యాంకు మేనేజర్ ద్వారపురెడ్డి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎల్‌బీఎం మాట్లాడుతూ కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందజేయాలన్నారు. ఈ నెల 17 తేదీన పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రారంభం అవుతుందన్నారు. జగనన్న తోడు ఏడో విడత ప్రారంభం అవుతున్నందున, సంబంధిత లబ్ధిదారుల వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల శిక్షణ తరగతుల జిల్లా అధికారి శ్రీనివాసరావు, కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాలకు చెందిన పలు బ్యాంకుల మేనేజర్‌లు, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

### క్వారీ అనుమతులు రద్దు చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మర్రిపాడు గ్రామస్తులు

మెళియాపుట్టి: మండల కేంద్రం, మర్రిపాడు-సి గ్రామానికి మధ్యలో ఉన్న ఇంజాద్రి కొండపై గ్రానైట్ క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని తహసీల్దార్ సరోజినికి మర్రిపాడుకు చెందిన గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొండపై ఇంజాద్రమ్మ దేవత ఆలయం ఉందని, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజలు నిర్వహిస్తుంటారని తెలిపారు. క్వారీ తవ్వకాలు జరిగితే దేవత ఆలయం తొలగిస్తారని, అనుమతులు రద్దు చేయాలని కోరారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: సైబర్ మోసాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ సీఎఫ్ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్, రామారావు అన్నారు. మండలంలోని తురకపేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448ను వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన


ఆశోకం గిరిజన గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: ప్రజాసంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గుమ్మపాడు సచివాలయ పరిధిలోని అక్కివలస, గుమ్మపాడు, గోపాలపురం, ఆశోకం, బొమ్మికపేట గ్రామాలలో కోదడ్డపనస సర్పంచ్ బాడాన కృష్ణారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పార్టీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, సర్పంచ్ కొండాల బాబూరావు, శంకరబాబు, గోవిందరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, రావాడ శ్రీనివాసరావు, యాళ్ల శ్యామసుందరరావు, మెండ రామకృష్ణ, మోహన్‌దాస్, పొన్నాన మోహన్‌రావు, మెండ వైకుంఠరావు, కోరాడ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ నాయకుడి కుటుంబానికి రూ 4.30 లక్షల లబ్ధి..**

గుమ్మపాడు గ్రామానికి చెందిన టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ కుటుంబానికి వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ 4.30 లక్షలు లబ్ధి చేకూరింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ కుటుంబానికి ఇచ్చిన సంక్షేమ లబ్ధి పత్రాన్ని ఎమ్మెల్యే కృష్ణదాస్ అందించారు.

## అందరి అంగీకారంతోనే..
# పోలింగ్ కేంద్రాల మార్పు


మాట్లాడుతున్న ఆర్‌ఓ జయదేవి

నరసన్నపేట: నియోజకవర్గంలో రానున్న ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలంటే సూచించాలని ఎన్నికల అధికారి జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లోని అధికారుల సూచనల ప్రకారం 30 పోలింగ్ కేంద్రాల భవనాలను మార్పు చేస్తున్నామన్నారు. మూడు చోట్ల పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నట్లు వివరించారు. ఇవి కాకుండా ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలంటే సూచించాలన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి మాట్లాడుతూ మడపాం పంచాయతీ బుచ్చిపేట ఓటర్లు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తపేటకు వెళ్తున్నారని, వారికి స్వగ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిని పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్‌కు ఆర్‌ఓ ఆదేశించారు. మాకివలస ప్రాథమిక పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని హైస్కూల్‌కు మార్చాలని శిమ్మ చంద్రశేఖర్ కోరారు. నరసన్నపేట న్యూ స్కూల్లో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాల్లో రెండింటిని జూనియర్ కళాశాలకు మార్పు చేస్తున్నామని ఆర్‌ఓ తెలిపారు. మిగిలిన కేంద్రాన్ని కూడా జూనియర్ కళాశాలకు మార్చాలని రెండు పార్టీలకు చెందిన నాయకులు కోరారు. తగిన నివేదిక రూపొందించాలని అధికారులకు ఆర్‌ఓ సూచించారు. నరసన్నపేట భవిత భవనంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఓటర్ల సౌకర్యార్థం జూనియర్ కళాశాల వద్దకు మార్చాలని ప్రతినిధులు కోరారు. అలాగే కొన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు ఉన్నాయని, అలాగే డూప్లికేట్లు పేర్లు ఉన్నాయని, వీటిని బీఎల్‌ఓలు తొలగించడం లేదని వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఆరంగి మురళి, సురంగి నర్సింగరావు కోరారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో సమావేశమై అందరి అంగీకారంతో అటువంటివి తొలగించాలని ఆర్‌ఓ సూచించారు. అలాగే ప్రతీ పోలింగ్ కేంద్రం కోసం బీఎల్‌ఓల నుంచి రాత పూర్వకంగా సర్టిఫికెట్ తీసుకోవాలని తహసీల్దార్లకు ఆదేశించారు. సమావేశంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, బీజేపీ నాయకులు కరుకుల రామారావు, ఎండ శ్రీనివాసరావు, నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# త్వరలో టిడ్కో ఇళ్ల అందజేత

- మెప్మా పీడీ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి జగ్గుశాస్త్రులపేట వద్ద నిర్మాణంలో ఉన్న 528 ఏపీ టిడ్కో ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందించేందు చర్యలు చేపడుతున్నట్లు మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక పట్టణ మహిళా సామాజిక వనరుల కేంద్రంలో మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాల మేరకు అక్టోబర్ ఆఖరు నాటికి పనులు పూర్తిచేసేలా టిడ్కో అధికారులు చర్యలు ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగానే డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో గృహాలు లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్లు పొందిన లబ్ధిదారుల నిబంధనల మేరకు బ్యాంకు రుణం ఒప్పందం తక్షణమే చేయాలని, ఆ మేరకు వారే నగదును టిడ్కోకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జగనన్న కాలనీ లే అవుట్లలో ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులు ముందుకురావాలని సూచించారు. ఈ మేరకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమీక్షలో భాగంగా జగనన్న తోడు, మెప్మా ప్రగతిపై సమీక్షించారు. హౌసింగ్ ఏఈ డి.సన్యాసిరావు, మెప్మా జిల్లా సిబ్బంది బి.రామారావు, వి.వి జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి


అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మంజూరైన యూనిఫాం, వెయింగ్ మిషన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఆర్.రాంబాబు, తహసీల్దార్ హనుమంతరావు, సీడీపీఓ హెచ్‌కె కామాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్ శంకరబాబు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### 62 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

మెళియాపుట్టి: ప్రజలకు వైద్యాన్ని అత్యంత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని చాపర పీహెచ్‌సీ వైద్యులు పావని అన్నారు. పాతమారేడుకోట గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. 62 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ప్రతీ ఇంటికి వైద్యులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య కిట్లు, దుస్తుల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, వ్యక్తిగత కిట్లు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించేలా పలు చర్యలు చేపడుతోందని, కార్మికుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పనిచేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు సుమారు రూ.3 లక్షల విలువ చేసే ప్రభుత్వ నిధులతో వ్యక్తిగత ఆరోగ్య కిట్లు, దుస్తులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి, శిల్లా మల్లికార్జునరావు, పార్టీ నాయకులు పి.చిన్నారావు, మామిడి రమేష్, బొడ్డేపల్లి రాజు, బొడ్డేపల్లి రమణమూర్తి, సాదు చిరంజీవి, జె.కె.ఆశిష్ విశ్వనాథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

పోలాకి: గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ వి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వాహకులు, కమిటీల వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. అనుమతులు పొందినచోట ఎటువంటి బలవంతపు వసూళ్లు, ట్రాఫిక్‌కు అంతరాయం, లౌడ్‌స్పీకర్లు, బాణసంచాలతో ఇతరులకు ఇబ్బందులు పెట్టడం, ఊరేగింపు సమయాల్లో అశ్లీలనృత్యాలు వంటివి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

### 260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

నరసన్నపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థులకు మంగళవారం పోలాకి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలగంగాధరరాజు కంటి పరీక్షలు చేపట్టారు. ఈ నెలాఖరుకల్లా మండలంలో అని స్కూళ్లలోని విద్యార్థులకు కంటి తనిఖీలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి కళ్లద్దాలు, తగిన చికిత్స అందిస్తామని బాలగంగాధరరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు పాల్గొన్నారు.

**167 మందికి...**

కొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని లబ్బ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం 167 మంది విద్యార్థులకు కంటి పరీక్షలను స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానికి రామయ్య నిర్వహించారు. ఏడుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. 10 మందికి సాధారణ కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి ఉతంగా మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం నీలకంటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్‌ఎం విజయ, ఆశ వర్కర్ పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వాలీబాల్ జట్టు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల పోటీల్లో (సచివాలయం, మండల స్థాయి) సత్తా చాటిందని హెచ్‌ఎం టి.కేశవరావు మంగళవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వాలీబాల్ క్రీడాకారులను హెచ్‌ఎం అభినందిచారు.

### ప్రకృతి వ్యవసాయంతో మేలు

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యదాయకమైన పంటలు పండుతాయని రిసోర్స్ పర్సన్ శ్రీను అన్నారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ సిబ్బందితో కలిసి మండలంలోని ఇల్లాయిపురం గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంటలలో పురుగుల నివారణకు నీమాస్త్రం, పంచపత్ర కషాయం ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్డినేటర్ నాగరాజు, నాగేశ్వరరావు, జగన్నాథం, మొబలైజర్స్ కల్యాణి, హరిశ్చంద్రరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### సేవాభావంతో పని చేయాలి

జలుమూరు: వలంటీర్లు సేవాభావంతో పని చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు అన్నారు. మంగళవారం పాగోడు సచివాలయంలో వలంటీర్లకు నియామకపత్రాలు అందించారు. అలాగే లింగాలవలస, కరవంజ, పర్లాం గ్రామాలలో వలంటీర్లకు వ్యవసాయ మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, సర్పంచ్ జుత్తు నేతాజి, తాడేల త్రినాధరావు నియామకపత్రాలు అందజేశారు.

### చేతుల శుభ్రతపై అవగాహన


చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: భవిష్యత్ తరాలకు నీరు అందాలంటే ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, పొదుపు చర్యలు జల్ జీవన్ మిషన్, డీపీఎంయూ ఐసీఈ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.మురళీమోహన్ అన్నారు. మండలంలోని సత్యవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి పొదుపు, చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వకుళ, నరసన్నపేట సబ్‌డివిజన్ కోఆర్డినేటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థలు దాతృత్వం చాటుకోవాలి


మెట్టక్కివలస అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: స్వచ్ఛంద సంస్థలు దాతృత్వాన్ని చాటుకోవాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకురావాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. తమ్మినేని ఇందుమతి, శ్రీరామ్మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ తమ్మినేని వాణీసీతారాం సమకూర్చారు. వీటిని స్పీకర్ చేతుల మీదుగా మంగళవారం ఆమదాలవలస పట్టణంలో మెట్టక్కివలస, మోనింగివారివీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలు గతం కంటే మెరుగుపడ్డాయన్నారు. వైద్యసేవలు ప్రజాభిమానాన్ని చూరగొంటున్నాయని తెలిపారు. వైద్యులు సేవలను విస్తృత పరిచినప్పుడే సర్కారీ వైద్యశాలలలో ఓపీ సంఖ్య క్రమేపీ మెరుగవుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో విద్యా, వైద్య రంగాలు పురోగతిలో పయనిస్తున్నాయని చెప్పారు. వెల్నెస్ సెంటర్లు, మొబైల్ వైద్యం ద్వారా ప్రాథమిక చికిత్స గ్రామాల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలకు స్వచ్ఛంద సంస్థల సేవలు కూడా తోడైతే అద్భుతమైన మార్పు సాధ్యమన్నారు. తమ్మినేని ఇందుమతి శ్రీరామ్మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య వైద్య రంగాలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, వైఎస్సార్ సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైస్ ఫ్లోర్‌లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి, పార్టీ నాయకులు మామిడి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి రాజు, బొడ్డేపల్లి రమణమూర్తి, సాధు చిరంజీవి రవికాంత్, అనిల్ ముత్త విజయ్, మెట్ట జోగారావు, వైద్య సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎల్.ఎన్.పేట: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమలకుమారి అన్నారు. మండలంలోని శ్యామలాపురం సెక్టార్ పరిధి వలసపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ మాసోత్సవాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ మహిళలకు పలు సూచనలు చేశారు. ప్రతీరోజు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవటం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. మన పెరటిలో పండించే తాజా కూరగాయలు, ఆకు కూరలు, మునగ ఆకు వంటి వాటిలో ఎన్నో పోషకాలు ఉన్నాయని వివరించారు. అలాగే జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, నవభారతి, సర్పంచ్‌లు బొడ్డేపల్లి రమణమ్మ, రావాడ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొత్తూరు ఏపీఎం త్రినాథమ్మ బదిలీ

కొత్తూరు: కొత్తూరు ఏపీఎంగా పనిచేస్తున్న తర్లి త్రినాథమ్మకు ఏపీఎం-ఐబీ టీపీఎంయూ సీతంపేటకు ఐటీడీఏ పీఓ బదిలీ చేసినట్లు ఏపీడీ ఆర్.వి.రమణ మంగళవారం తెలిపారు.

కొత్తూరు ఏపీఎం బాధ్యతలను కొత్తూరు ఎంఎస్‌సీసీగా పనిచేస్తున్న కె.జనార్దనరావుకు బాధ్యతలు అప్పగించాలని పీఓ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

నరసన్నపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా మక్కువ చూపాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా మంగళవారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీపీ మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ విభాగాల్లో బాల, బాలికలను వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ పోటీలకు 76 మందిని ఎంపిక చేశారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి 340 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, బీఎల్ శర్మ, నేతింటి రాజేశ్వరరావు, హెచ్‌ఎం వెంకటరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

**ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి..**

జలుమూరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థి దశ నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. మంగళవారం కరవంజ మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ఎంపికలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా పది జట్లు పాల్గొనగా.. ఇందులో ఒక్కో ఆటకు ఒక్కొక్కటి చొప్పున మూడు బృందాలను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు యలమంచిలి పీఈటీ చంద్రశేఖర్ తెలిపారు. ప్రిన్సిపాల్ గణేష్‌పట్నాయక్, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్ జుత్తు నేతాజి తదితరులు పాల్గొన్నారు.

**ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు**

పాతపట్నం: మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల, నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు మంగళవారం పూర్తిచేసినట్లు ఎంఎస్‌ఓ, పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికలు నిర్వహించామని, నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై ప్రతిభ కనబర్చారు. నియోజకవర్గ స్థాయి వాలిబాల్ క్రీడలను హెచ్‌ఎం బి.సింహాచలం ప్రారంభించారు. అండర్ 14, 17లలో ఎంపికైన క్రీడాకారులు డివిజన్, జిల్లా స్థాయిలో పాల్గొంటారని పీడీ తెలిపారు. పీఈటీలు జైకృష్ణ, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట దోపిడీ

పాతపట్నం: స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట యువతను మోసగించడంతోనే చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధించిదని ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అమ్మవారి ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, పార్టీ నాయకులు పనుకు మోహన్, రాము పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అరెస్టు అవ్వటంతో టీడీపీ నాయకుల్లో భయం పట్టుకుందని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా అవినీతికి పాల్పడిన చంద్రబాబు ఇన్నాళ్లకు శిక్ష పడిందన్నారు. పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, ముద్దాడ లక్ష్మణరావు, తలసముద్రం శోభన్‌బాబు, బలగ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

**చట్టప్రకారమే చంద్రబాబు అరెస్టు**

హిరమండలం: ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందంటూ టీడీపీ నేతలు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు విష్ణు ప్రసాద్ పండా, నాయకులు రామకృష్ణ, ఎం.శంకరరావు, టి.మురళీధర్ తదితరులున్నారు.

ఎల్.ఎన్.పేట: రాజ్యాంగ వ్యవస్థలను తప్పుదారి పట్టించి 40 ఏళ్లుగా అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిందని కొత్తూరు వైస్ ఎంపీపీ, పాతపట్నం నియోజకవర్గం నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుతో పాటు అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.